పిల్లల చదువులపై ఫీజుల కొరడా!

- ఇష్టారాజ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు
- విద్యాసామగ్రి పేరిట అదనంగా వసూలు
- కార్పొరేట్ పాఠశాలల్లో 'చదువుకొంటున్న' వైనం



పొన్నూరు: ఫలితాలు, ర్యాంకులను బేరీజు వేసుకుంటూ.. సామాన్య, మధ్య తరగతి వర్గాలు సైతం తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించేందుకు మొగ్గుచూపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. కనీస నిబంధనలు పాటించకుండా ఏటేటా రుసుములు పెంచేస్తున్నాయి. ఇది చాలదన్నట్లు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, విద్యాసామగ్రి పేరిట అదనపు భారం మోపుతున్నాయి. పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయించొద్దంటూ విద్యాశాఖ అధికారులు ఇస్తున్న ఆదేశాలను ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు.

తప్పనిసరంటూ..

పొన్నూరులో 28కి పైగా ప్రైవేటు పాఠశాలలున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే విద్యార్థులను ఇబ్బడిముబ్బడిగా చేర్చుకున్నారు. సీట్లు పూర్తయిపోతున్నాయంటూ నమ్మబలికి ముందస్తుగానే తొలి విడత రుసుములు వసూలు చేశారు. కొందరు నిర్వాహకులు అప్లికేషన్‌తోనే చేరుకుని, ఆ తర్వాత వివిధ రూపాల్లో తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. తీరా పాఠశాలలో చేర్పించాక చేసేదేమీ లేక తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఏకరూప వస్త్రాలు, పుస్తకాలు, ఇతర సామగ్రి కూడా తమ పాఠశాలలోనే కొనుగోలు చేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. వీటికి 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు లాగేస్తున్నారు. ఆపై తరగతుల విద్యార్థులకు కొత్త కోర్సులంటూ అదనంగా వసూలు చేస్తున్నారు. బడి బస్సుల రుసుములనూ అడ్డగోలుగా పెంచేస్తున్నారని.. మరో గత్యంతరం లేక వారు అడిగినంత చెల్లించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యం..

చాలా వరకు ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు కల్పించకుండా ఇరుకు గదుల్లోనే పాఠాలు చెబుతున్నారు. క్రీడా మైదానాలు ఉండవు.. తల్లిదండ్రుల కమిటీలు కాగితాల్లోనే ఉంటాయి. పేద విద్యార్థులకు రాయితీపై విద్యనందించాలని ప్రభుత్వం సూచించినా పట్టించుకోవడంలేదు. రుసుముల్లో కొంత స్కూలు నిర్వహణ, సిబ్బంది ప్రయోజనాలకు వెచ్చించాలనే నిబంధన ఏ స్కూల్‌లోనూ అమలు కావడం లేదు.

అధిక ఫీజులను నియంత్రించాలి..

ఏటా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం మోయలేకపోతున్నాం. ఫీజులతో పాటు పుస్తకాలు, దుస్తులను స్కూళ్లలోనే కొనాలని ఒత్తిడి చేస్తున్నారు. పుస్తకాలు రూ.వేలల్లో విక్రయిస్తున్నారు. పాఠ్య పుస్తకాలు రూ.వందల్లో అయితే మెటీరియల్ మాత్రం రూ.5 వేలకు పైగానే విక్రయిస్తూ భారం మోపుతున్నారు. అధికారులు ఫీజులను నియంత్రించాలని కోరుతున్నాం.

– షేక్ సలీం, ఇటికంపాడు రోడ్డు, పొన్నూరు

సరైన వసతులు ఉండవు..

ప్రైవేటు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు ఉండటంలేదు. పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలాలు లేవు. కానీ ఫీజులు మాత్రం అమాంతం పెంచేస్తున్నారు. ప్రవేశాలు కోసం ఉపాధ్యాయులు ఇళ్ల వద్దకు వచ్చి మా పాఠశాల మంచిది.. అన్ని వసతులు ఉంటాయి చేర్పించండి అంటూ బతిమాలతారు. తీరా చేర్పించాక అధిక ఫీజులు, దుస్తులు, పుస్తకాల ధరలు చెల్లించలేక అల్లాడిపోతున్నాం.

– కోటేశ్వరమ్మ, ఇందిర నగర్ కాలనీ, పొన్నూరు

అధిక ఫీజులపై ఫిర్యాదు చేయండి..



ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులు విక్రయించరాదు. అధిక ఫీజులు వసూలు చేసి, పుస్తకాలు, దుస్తులు స్కూల్‌లోనే కొనాలని స్కూల్ యాజమాన్యాలు ఇబ్బందులు పెడితే తల్లిదండ్రులు ఎంఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయండి. వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

– కె.విజయభాస్కర్, ఎంఈవో

క్లుప్తంగా

చెత్త సంపద షెడ్‌లను ఉపయోగించాలి



అప్పాపురం(కాకుమాను): గ్రామాలలో నిర్మించిన చెత్త సంపద షెడ్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ జ్యోతి బసు అన్నారు. మండలంలోని అప్పాపురం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. చెత్త ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో షెడ్‌లను నిర్మించినట్లు ఆయన తెలిపారు. రోజూ గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను తడి, పొడి చెత్తగా విభజించి షెడ్‌లలో ఉంచాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని.. కాకుమాను పంచాయతీ కార్యాలయం వద్ద పౌండేషన్ దశలో ఉన్న స్థలంలో నూతన భవనం నిర్మించే విధంగా ఉన్నత స్థాయి అధికారులతో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ సాయి కుమార్, ఎంపీడీఓ యుగకీర్తి, డెప్యూటీ ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి సమష్టి బాధ్యత



ప్రత్తిపాడు: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులంతా సమష్టి బాధ్యత తీసుకోవాలని ఉప విద్యాశాఖాధికారి జి.ఏసురత్నం అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిష్టర్లతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులంతా పరస్పర సహకారంతో ఒక్కొక్కరూ ఒక్కో బాధ్యతను తీసుకుని, పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ అలీషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఫిరంగిపురం: కళాశాలలో తమ సమస్యలు పరిష్కరించాలని ఇమ్మి కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు సీఐ శివరామకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తమ కళాశాలలో కనీస వసతులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సరైన భోజన వసతి, మరుగుదొడ్లు, తాగునీరు సరిగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికారులకు సమస్యను తెలిపినా ఫలితం లేదని వారు వాపోయారు. పరీక్షల సమయంలో మరో ప్రాంతానికి వెళ్లాలంటే వాహనం ఉన్నా సమకూర్చడం లేదని చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలు తెలియజేస్తామన్నారు. స్పందించిన సీఐ శివరామకృష్ణ కళాశాల వద్దకు వచ్చి యాజమాన్యంతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చూస్తానని చెప్పారు. ఆయన వెంట ఎస్ఐ సురేష్, రైటర్ దాసు, సిబ్బంది ఉన్నారు.

చలో తెనాలిని జయప్రదం చేయాలి



తాడేపల్లి రూరల్: ఈనెల 28న నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డులో చలో తెనాలి కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలి పట్టణంలో పోలీసు అధికారులు నడిరోడ్డుపై దళిత యువకులపై చేసిన అరాచకాన్ని నిరసిస్తూ నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో దర్శనపు విజయ్‌బాబు, కె.బాబూరావు, కేవీపీఎస్ నాయకులు శ్యామ్, నాని, ఏసోబు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక సంగడిగుంట మంత్రివారిబజార్‌లోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ మందిర వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వరరాగ సుధా గుంటూరు ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు సాయిబాబాశర్మ, కృష్ణకుమారి బృందం ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. అనంతరం పుర వీధుల్లో స్వామి ఊరేగింపు వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



పొన్నూరు: పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు వెళ్లాలని పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు కొలను మంగనాథరావు అన్నారు. పట్టణంలోని శ్రీ రామ మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతిలో ప్రతిభావంతులైన విద్యార్థులు పి.జోత్స్నశ్రీ, శ్రీలత, జీవీ ప్రవీణ్‌లకు నగదు బహుమతులు, మెమెంటోలను అందజేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు పి.జయ కుమార్, పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు కాకుమాను లాజరుబాబు, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, స్కూల్ పూర్వ ఉపాధ్యాయులు సీహెచ్ నాగశ్రీనివాసరావు, ఎంవీ గౌతమ్, వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ సీపీఎం నిరసన

పెదకాకాని: ఇరాన్‌పై అమెరికా పాశవికంగా దాడి చేయడం ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. పెదకాకానిలోని సుందరయ్య నగర్‌లో మంగళవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత ప్రధాని మోదీ అమెరికా యుద్ధోన్మాద చర్యలను ఖండించాలన్నారు. మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. నాయకులు బి.సాంబయ్య, వెంకటేశ్వర్లు, బాజమ్మ, కె.నాంచారమ్మ, ఎస్కే మీరా సాహెబ్ పాల్గొన్నారు.

విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ వర్కర్లు బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించాలని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో జి.విజయలక్ష్మి అన్నారు. ప్రాజెక్టు పరిధిలో నలుగురు అంగన్‌వాడీ హెల్పర్లకు అంగన్‌వాడీ వర్కర్లుగా ప్రమోషన్ కల్పించారు. వీరికి మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో నియామక ఉత్తర్వులు అందించారు. ప్రత్తిపాడు ముస్లిం ఏరియా అంగన్‌వాడీ హెల్పర్ షేక్ హసీనాను ప్రత్తిపాడు మెయిన్ అంగన్‌వాడీ సెంటరుకు.. పెదనందిపాడు ఎన్‌టీఆర్ కాలనీ సెంటరు హెల్పరు కె.నాగమణిని కొత్తపాలెం అంగన్‌వాడీ సెంటరుకు.. కాకుమాను మండలం బికెపాలెం ఓసీ సెంటరు హెల్పరు డి.లక్ష్మిను బికెపాలెం ఓసీ సెంటరుకు.. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు మెయిన్ సెంటరు హెల్పరు వి.కృష్ణకుమారిను అదే సెంటరుకు అంగన్‌వాడీ వర్కరుగా నియమించామని సీడీపీవో తెలిపారు. సమర్థవంతంగా నూతన అంగన్‌వాడీ వర్కర్లు విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ హెల్పర్లకు వర్కర్‌గా ప్రమోషన్ ఆర్డర్లను అందిస్తున్న విజయలక్ష్మి

బాల్య వివాహాలను అరికట్టాలి

పొన్నూరు: మండల పరిధి పచ్చల తాడిపర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మై ఛాయిసెస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అన్నారు. మానవ అక్రమ రవాణా, గృహ హింస లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రమీలదేవి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, అవసరానికి మించి ఉపయోగించకూడదని అన్నారు. ల్యాంప్ సంస్థ ప్రోగ్రాం ట్రైనర్ తురకా మంగయ్య విద్యార్థులకు ఉచితంగా కామిక్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, సంస్థ ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయిని సరళాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అందుకున్న పుస్తకాలతో విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

ట్రిపుల్ ఐటీకి నారాకోడూరు విద్యార్థి ఎంపిక



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పచ్చా తేజ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు మంగళవారం తెలిపారు. ఓపెన్ మెరిట్‌లో ట్రిబుల్ ఐటీ ఒంగోలులో క్యాంపస్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. రాజీవ్ గాంధీ టెక్నాలజీ యూనివర్సిటీ ప్రకటించిన ఫలితాల్లో తేజ ప్రతిభ కనబరిచినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు తేజకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయం

పట్నంబజారు: క్రెడిట్ కార్డు నుంచి నగదు మాయమైన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. నెహ్రూనగర్ 9వలైనులో నివాసం ఉండే కె.రాఘవరావుకు ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 6న అతడి క్రెడిట్ కార్డు నుండి రూ.49,320 వేరే సంస్థకు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. 1930 ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కనబడలేదు. బాధితుడు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణానికి ప్రమాద సూచిక!



ఒక పక్క రహదారి భద్రత అంటూ అధికారులు పదే పదే ఉపన్యాసాలిస్తున్నారు. కానీ రహదారులపై ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా మారింది. అందుకు దర్పణమే ఇక్కడ కనిపిస్తున్న చిత్రం. గుంటూరు-పర్చూరు పాతమద్రాసు రోడ్డులో ఐదవమైలు-కోయవారిపాలెం సమీపంలో రోడ్డుపై మార్జిన్‌కు చేరువలో గుంత పడింది. గుంతను పూడ్చాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు గుంతలో ఓ కర్ర ముక్కను ఉంచి, దానికి స్టిక్కర్లు అతికించారు. రాత్రి సమయాల్లో దగ్గరకు వచ్చే వరకూ కర్ర కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని.. కర్రను తీసి, గుంతను పూడ్చాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

– ప్రత్తిపాడు

అతిసారను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం

ప్రత్తిపాడు: అతిసారను నిర్లక్ష్యం చేయడం ప్రాణాలకు ప్రమాదమని ప్రత్తిపాడు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణం నేపథ్యంలో ప్రజలు జ్వరాలు, డయేరియా, జలుబుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు భోజనం చేసే సమయంలో కచ్చితంగా చేతులను సబ్బుతో పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాప్రసాద్

వ్యవసాయ సూచనలు తప్పక పాటించాలి

పొన్నూరు: మండలంలోని చింతలపూడి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్ వెంకటేశ్వరావు పాల్గొని మాట్లాడారు. రైతు భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు కె.రత్న, తేజశ్రీ, సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: మండలంలోని చిన్నపలకలూరు, మల్లవరం, గొర్లవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ.. పొగాకు అమ్మేందుకు రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు అమ్మితే రైతులు తమ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు అధికారులు పాల్గొన్నారు.

చేబ్రోలు: రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయశాఖాధికారి పి.ప్రియదర్శిని అన్నారు. చేబ్రోలు మండలం శేకూరు, వీరనాయకునిపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొండపాటూరు(కాకుమాను): రానున్న ఖరీఫ్ సీజన్‌కు సిద్ధపడుతున్న రైతులు దుక్కి దున్నిన తరువాత పచ్చిరొట్ట ఎరువును వేసుకోవాలని ఏఓ సుధాకర్ అన్నారు. మండలంలోని కొండపాటూరు, కాకుమాను గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులతో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: యాభై శాతం రాయితీపై పిల్లిపెసర, జీలుగ, జనుము విత్తనాలను అందించనున్నామని ఏవో సీహెచ్ సునీత అన్నారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి, కాట్రపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయితీపై అందించిన విత్తనాలను ఆమె రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్ఏ వంశీ, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: పంటల మార్పిడితో సత్ఫలితాలు ఉంటాయని ఏవో షేక్ సుగుణబేగం అన్నారు. ప్రత్తిపాడులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైన నేపథ్యంలో దుక్కులు దున్నడం, విత్తనాల కొనుగోలు, పంటల సాగు పద్ధతులపై రైతులకు వివరించారు. ఏవో మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా వారి నుంచి బిల్లు తీసుకోవాలన్నారు. పంట కాలం పూర్తయ్యి దిగుబడులు చేతికొచ్చే వరకు బిల్లు భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగమణి, ఎంపీఈవో చరణ్, రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో, రైతులు



శేకూరు కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ప్రియదర్శిని

ప్రతి విద్యార్థికి కిట్టు అందించాలి

ప్రత్తిపాడు: ప్రతి విద్యార్థికి ఎస్ఆర్‌వీఎం కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంఎస్ఏ డైరెక్టర్ పి.పార్వతి అన్నారు. పెదనందిపాడులోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. కిట్ల వివరాలను ఎంఈవో ముద్దన శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు వెళ్లిన కిట్లను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులందరికీ అందించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంవో డి.అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణన్ స్టూడెంట్ కిట్‌లు పంపిణీ చేయాలని ఆర్ఎంఎస్ఏ డైరెక్టర్ పార్వతి అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ ఈ సందర్భంగా తెలిపారు.



ఎస్ఆర్‌వీఎంకే స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎంఎస్ఏ డైరెక్టర్ పార్వతి

వివాహిత బలవన్మరణం

లక్ష్మీపురం: ఎలుకల మందు తిని మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావుపేటకు చెందిన పెద్ది ఎలీషా రాణి(21) నాలుగేళ్ల క్రితం కొండా వెంకటప్పయ్య కాలనీకి చెందిన కోటిని వివాహం చేసుకుంది. వీరికి ఒక పాప. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఏలీషా రాణి తొమ్మిది నెలలుగా శ్రీనివాసరావుపేటలోని ఇల్లు అద్దెకి తీసుకొని నివాసం ఉంటుంది. తల్లి లక్ష్మీ ఈనెల 23న కుమార్తె ఎలీషా రాణి ఇంటికి వెళ్లింది. ఎలీషా రాణి తాను ఎలుకల మందు తిన్న విషయం తల్లికి చెప్పడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఎలిషారాణి మృతి చెందింది. విషయం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తక్షణమే స్పందిస్తే ప్రాణ నష్టాన్ని తగ్గించగలం

తాడేపల్లి రూరల్: అనుకోని విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే స్పందిస్తే ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్ దీపక్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పరిధిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో 'ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి సంసిద్ధత'పై ఎయిమ్స్ వైద్యులు, ఆంధ్ర, తెలంగాణ, పుదుచ్చేరి, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 30 మంది వైద్యులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ దీపక్ మాట్లాడుతూ.. విపత్తుల ముందు, ఆ తరువాత అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులు, డాక్టర్లు విపత్తుల ప్రమాద తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మంగళగిరి ఎయిమ్స్‌లోని నిర్మాణాత్మక పరికరాలు, అనుభవం కలిగిన డాక్టర్లు, మెడిసిన్, టెస్టింగ్ పరికరాలు, బ్లడ్‌బ్యాంక్ వంటి ఇతర వివరాలను అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎయిమ్స్ అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఓడీ డాక్టర్ రామమోహన్, డాక్టర్ రమ్యజ్యోతి, విపత్తుల సంస్థ అధికారులు ఆర్ఎస్ఐ మధుబాబు, జీఐఎస్ ఎక్స్‌పర్ట్ హరీష్, ప్రాజెక్ట్ మేనేజర్లు బస్వంత్, కిషోర్, సతీష్, పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్ దీపక్

జీజీహెచ్‌కు పరికరాల వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగంలో పూర్వ ఆర్థోపెడిక్ విభాగం అధ్యాపకులు, రామచంద్ర జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ తరఫున డాక్టర్ శివయ్య రూ.2 లక్షల విలువైన మన్మన్ పవర్ డ్రిల్‌ను ఆర్థోపెడిక్ విభాగానికి మంగళవారం బహూకరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, అధ్యాపక బృందం సమక్షంలో వితరణ చేశారు. డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా ఎముకలకు డ్రిల్ చేయడం, స్క్రూ అమర్చుటకు, వైర్ అమర్చుటకు, రీప్లేస్మెంట్ శస్త్ర చికిత్స కొరకు పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. దీనిని వితరణ చేసిన డాక్టర్ శివయ్యను అభినందించారు.